క్లుప్తంగా

లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

● ఎస్సై గణేష్



మాట్లాడుతున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్ప రచుకుని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని ఎస్సై గణేష్ తెలిపారు. ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, మంచి చెడుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరికి ఏ ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు నేరుగా గానీ 112 నంబర్‌కు కాల్‌చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లు పెరగాలి..



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో నూతన ఓటర్లు పెరిగేలా ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నగరంలోని 160, 161, 162, 163, 164, 194, 197, 198, 233 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు ఈ ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నవంబర్ 23, 24వ తేదీలలో కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సన్మానం ..



జనార్దనరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న తుంపల్లి జనార్దనరావును మాతృభూమి సేవా సంఘం ప్రతినిధులు సన్మానించారు. ఆదివారం స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో జనార్దనరావును రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సత్కరించారు. కార్యక్రమంలో బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులు అప్రమత్తం..



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై దుర్గాప్రసాద్

పూసపాటిరేగ: చింతపల్లి బీచ్‌కు వెళ్లే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని చింతపల్లి బీచ్‌లో ఆదివారం ఆయన పర్యటించి పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రంలో స్నానాలకు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదని హెచ్చరించారు. కార్తీక మాసం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నందున మెరైన్, లోకల్ పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పర్యాటకులకు ఎటువంటి ఆపద కలగకుండా 10 మంది గజఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆయనతో పాటు చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్సైలు వాల్లె శ్రీనివాసరావు, స్వీటీ సత్తి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్వో నూకరాజు

నెల్లిమర్ల: కొత్తగా ఓటు నమోదుకు, జాబితాలో తప్పులను సవరించుకోవడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న 21, 22 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం ఎలా జరుగుతుందనే విషయమై ఆరా తీశారు. ఈ నెల 23, 24 తేదీల్లో కూడా ప్రత్యేక నమోదు కార్యక్రమం కొనసాగుతుందని.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎన్నికల విభాగం డీటీ వీవీఆర్ జగన్నాథరావు ఉన్నారు.

న్యాయమూర్తులను అందించడంలో
విజయనగరం ముందంజ

రాష్ట్రానికి న్యాయమూర్తులను అందించడంలో విజయనగరం ముందంజలో ఉందని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. విజయనగరం జిల్లా కోర్టు నూతన భవన సముదాయానికి రూ. వంద కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ఈ జిల్లాలో గతంలో అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా పని చేసిన పలువురు న్యాయమూర్తులు, జిల్లా వాసులైన హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సత్కరించారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దోనాడి రమేష్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ జి.రామకష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తదితరులు సత్కారం అందుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



జస్టిస్ మనవేంద్రనాథ్ రాయ్‌ను సత్కరిస్తున్న విజయనగరం జిల్లా న్యాయవాదులు



జస్టిస్ కృష్ణమోహన్‌కు సత్కారం



సత్కారం అందుకుంటున్న జస్టిస్ రామకృష్ణప్రసాద్



జస్టిస్ డి.రమేష్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు



జస్టిస్ ఎన్.జయసూర్యకు సత్కారం



జస్టిస్ సురేష్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న న్యాయవాదులు



సత్కారం అందుకుంటున్న జస్టిస్ మన్మథరావు



జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లకు సత్కారం



జస్టిస్ చీమలపాటి రవి సత్కరిస్తున్న న్యాయవాదులు



జస్టిస్ టి.రాజశేఖర్‌కు సత్కారం

మరింత పారదర్శకంగా..

- ఆన్‌లైన్‌లో స్వయం సహాయక సంఘాల వివరాలు
- ఈ నెల 30వ తేదీలోగా ప్రక్రియ పూర్తికి ఆదేశాలు
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ప్రారంభమైన ప్రక్రియ



స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు

విజయనగరం: మెప్మా సంఘాల్లో సభ్యుల వివరాలన్నీ ఇకపై ఆన్‌లైన్ కానున్నాయి. ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ పేరిట ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ఆయా సంఘాల్లో సభ్యులంతా ఉన్నారో లేదో తేటతెల్లమవుతుంది. కొన్ని సంఘాల్లో సభ్యులు ఉపాధి నిమిత్తం ఇతర దేశాల్లో ఉంటున్నా... ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ నమోదుతో ఇలాంటి అక్రమాలకు తెరపడనుంది.

పారదర్శకంగా..

కొన్ని సంఘాల్లో సభ్యులకు రుణ వాయిదాల చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలపై అవగాహన లేదు. దీంతో రిసోర్స్‌పర్సన్లకు, ఇతరులకు నగదు ఇచ్చి బ్యాంకుల్లో జమ చేయిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాల్లో అనేక అవకతవకలు వెలుగుచూస్తున్నాయి. ఇకపై యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో సభ్యులు నగదు జమ చేయవచ్చు. సభ్యుల్లో ఎవరైనా చనిపోయిన, దేశం విడిచి వెళ్లినా పేర్లను సంఘాల్లో కొనసాగిస్తున్న ఉదంతాలు బయటపడతాయి. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు సమయంలో ఇప్పటి వరకు ఎంత రుణం తీసుకున్నారు.. ఆ మొత్తంతో చేకూరిన ఆర్థిక లబ్ధి ఏమిటో తెలపాల్సి ఉంటుంది. సభ్యులందరినీ సమావేశపరిచి ఒకేసారి పేర్లు, చిరునామా, ఆధార్, ఇతరత్రా 16 రకాల వివరాలు నమోదు చేస్తారు. సభ్యులెవరైనా అందుబాటులో లేకపోతే గ్రూప్ పరిస్థితి ఏమిటన్నది తర్వాత నిర్ణయిస్తారు.

సమగ్ర సమాచారం..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 5,389 స్వయం సహాయక సంఘాలున్నాయి. అందులో 56,064 మంది సభ్యులున్నారు. లబ్ధిదారుల వివరాలను యాప్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి నమోదు చేస్తున్నారు.ఈ ప్రక్రియ ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయితే సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుంది. మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతికి ఇది దోహదపడుతుంది.

– సన్యాసిరావు, సీఎంఎం, విజయనగరం కార్పొరేషన్

ఫ్రెషర్స్ డే వేడుకలు



లెండి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని చదువుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు, సీఏ ఎస్వీ ప్రభాకర్, అధ్యాపకులు సీహెచ్ బంగార్రాజు, అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

– భోగాపురం

నాగాభరణం వితరణ



నగర పంచాయతీ పరిధి కొండపేటలో ఉన్న మాంగళ్య గౌరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయానికి అదే ప్రాంతానికి చెందిన భక్తులు రెండున్నర కిలోల వెండి నాగాభరణాన్ని ఆదివారం వితరణగా అందజేశారు. మజ్జి సూర్యనారాయణ, పోలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్లు ఆలయ అర్చకులు కామేశ్వరశర్మకు ఆభరణాన్ని అందజేయగా.. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు మజ్జి శ్రీనివాసరావు, గణేష్, త్రినాథ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

మరుగుదొడ్ల అధ్వానం..



నెల్లిమర్ల మండలంలోని బొప్పడాం వసతిగృహంలో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఈ వసతిగృహంలో సుమారు 100 మందికి పైగానే విద్యార్థులు చదువుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కూడా లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– నెల్లిమర్ల రూరల్

ఓటర్ల తుది జాబితా విడుదల



రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తున్న తహసీల్దార్ సురేష్

భోగాపురం: ఈ నెల 28న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం. సురేష్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఏర్పాటు చేసి అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల తుది జాబితాను ఉంచినట్లు చెప్పారు. అనంతరం మండలంలోని సవరవల్లి, భోగాపురం, పోలిపల్లి, గుడివాడ, ముంజేరు, నందిగాం, చెరుకుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించాలని సచివాలయ సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ కనకమహాలక్ష్మి, వీఆర్వోలు, బీఎల్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లదే కీలకపాత్ర

● మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిలో కాంట్రాక్టర్లే కీలకపాత్ర పోషించాలని నగరమేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌కే ఫామ్‌హౌస్‌లో కార్తీకసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, సమష్టి కృషితోనే నగరాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు బంగార్రాజు, కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు, మున్సిపాల్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, ఈఈ టి. రాయల్‌బాబు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి అన్నపూర్ణ

నెల్లిమర్ల: ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం సాగించొచ్చని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సేవా కేంద్రాల ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ రాజయోగిని బీకే అన్నపూర్ణ అన్నారు. నెల్లిమర్లలోని బృందావనం వ్యాలీలో ఉమ్మడి విజయనగరం జిల్లాల బ్రహ్మకుమారీస్ కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. మనిషిలో ఒత్తిడి, అశాంతి, దుఃఖం మానసిక, శారీరక రుగ్మతలు దూరం కావాలంటే ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు డాక్టర్ బీకే సరస్వతి, బీకే రత్న, బీకే శాంతి, బీకే లత, సుమారు 1500 మంది బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తే చర్యలు

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వారం రోజులుగా జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 11 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్ట్ చేశామన్నారు. 11 వాహనాలు సీజ్ చేసి 189 పశువులను గోశాలలకు తరలించామన్నారు.

నేటి నుంచి ప్రార్థనా వారోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్ అలజంగి రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: నగరంలోని అంబటిసత్రం వద్దనున్న ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న ప్రార్థనా వారోత్సవాలను విజయవంతం చేయాలని పాస్టర్ అలజంగి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. చర్చి ఆవరణలో వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల క్షేమం, శాంతికి ప్రతి ఏటా నవంబర్ నెలలో నిర్వహించే కార్యక్రమాన్ని ఈ సారి గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామన్నారు. వేకువజామున 4 గంటల నుంచి 6 వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, ఎస్‌కే చౌదరి, కోరాడ నాగేశ్వరరావు, విక్టర్‌బాబు, సూర్యనారాయణ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



భోగాపురం: సీజ్ చేసిన మద్యం సీసాలతో ఎస్సైలు చంద్రమోహన్, సురేష్, సిబ్బంది



విజయనగరం రూరల్: పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సిబ్బంది

భోగాపురం: మండలంలోని గాబువానిపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పల్లా పైడిరాజు అనే వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సైలు చంద్రమోహన్, సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ.. నిందితుడు కొంతకాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాటు వేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుంచి 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. దాడుల్లో హెచ్‌సీ రామారావు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

12 సీసాలు..

విజయనగరం రూరల్: మండలంలోని పినవేమలికి చెందిన పి.సత్యారావు అనే వ్యక్తి నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై వి.రామారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడుల్లో హెచ్‌సీ ఎం.నాగేశ్వరరావు, జి.సుదర్శన్ కుమార్, బి.రాము, ఎన్. ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కళింగ కార్తీక వనభోజనాలు



మాజీ వీసీ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లా కళింగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామనారాయణం సమీపంలోని తోటలో కళింగ కార్తీక వనభోజన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న కళింగ సామాజిక కుటుంబాలు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వ్యవస్థాపక మాజీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ హనుమంతు లజపతి రాయ్ ప్రసంగిస్తూ.. ఉత్తరాంధ్రలో వెనుకబడి ఉన్న కళింగ కులాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో పేరుగాంచిన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో కళింగ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు లోహితుడు, ప్రధాన కార్యదర్శి మోహనరావు, సలహాదారు డాక్టర్ ఎస్వీ రమణ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయనగరం

9951602843

Office mail : vzmadvt@gmail.com